క్లుప్తంగా

ఘనంగా ప్రపంచ పట్టణ ప్రణాళిక దినోత్సవం



పెడన: పెడన పురపాలక సంఘ కార్యాలయంలో శుక్రవారం ప్రపంచ ప్రణాళిక దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ ఎం.గోపాలరావు ప్లానింగ్ కార్యదర్శులను ఉద్దేశించి మాట్లాడుతూ సమాజంలో ప్లానింగ్ కార్యదర్శుల పాత్ర కీలకమన్నారు. కమ్యూనిటీల అవసరాలకు అనుగుణంగా గృహాల నిర్మాణాలు, రోడ్లు అందించడంలో, పరిష్కారాలు రూపొందించడానికి సాయం చేయడంలో ప్లానర్ల పాత్ర చాలా ముఖ్యమన్నారు. టీపీవో సుజనాకుమారి, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు పామర్తి జితేంద్ర, బండి కిరణ్, ప్లానింగ్ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యపరీక్షలు

చిరువోలు(మోపిదేవి): మెరకనపల్లి పంచాయతీ పరిధిలోని చిరువోలు అంగన్‌వాడీ కేంద్రం వద్ద రేపల్లెకు చెందిన ఫోకస్ కంటి హాస్పటల్ వారు శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. నేత్ర వైద్యుడు ప్రవీణ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో వృద్ధాప్యంతో దూర ప్రాంతాలకు వెళ్లి కంటి పరీక్షలు చేయించుకోలేని వారిని దృష్టిలో పెట్టుకుని ఫోకస్ కంటి హాస్పటల్‌వారు ప్రతి వారం ఒక గ్రామంలో ఉచిత కంటి వైద్య క్యాంపులు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఓపీలో 65 మందికి వైద్య పరీక్షలు చేయగా 25 మందికి ఉచిత కళ్లజోళ్లు అందజేసినట్లు తెలిపారు. 10 మందికి ఆపరేషన్ చేయాలని పేర్కొన్నారు. అంగన్‌వాడీ వర్కర్ శాంతాదేవి, హాస్పటల్ వైద్య సిబ్బందితో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఈవ్‌టీజింగ్‌లు, గొడవలుంటే తక్షణం సమాచారమివ్వండి



పెడన: పాఠశాలల వద్ద ఈవ్‌టీజింగ్‌లు, గొడవలు ఏమైనా జరుగుతుంటే తక్షణం సమాచారం ఇవ్వాలని పెడన ఎస్‌ఐ జి.సత్యనారాయణ సచివాలయాల మహిళా పోలీసులకు సూచించారు. శుక్రవారం ఆయన పోలీస్‌స్టేషన్‌లోని తన చాంబర్‌లో పెడన పట్టణంతో పాటు మండలంలోని వార్డు, గ్రామ సచివాలయాల పరిధిలోని మహిళా పోలీసులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ బాల్య వివాహాలు, లైంగిక దాడులు జరిగినట్లు మీ దృష్టికి వచ్చిన వెంటనే సమాచారమివ్వాలని తెలిపారు. సమాచార సేకరణలో ఇబ్బందులుంటే వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఏం జరిగినా ముందుగా మీ నోటీసుకు వచ్చేలా నడుచుకోవాల్సిందిగా ఆయన సూచించారు.

సీఐటీయూ మండల నూతన కమిటీ



నాగాయితిప్ప(మోపిదేవి): నాగాయితిప్ప గ్రామంలో సీఐటీయూ మండల మహాసభ శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా కమిటీ సభ్యులు శీలం నారాయణరావు తెలిపారు. జిల్లా కమిటీ కార్యదర్శి వైవీ నరసింహారావు సమక్షంలో జరిగిన ఎన్నికలో నూతన కార్యదర్శిగా బండి ఆదిశేషు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. అనంతరం కమిటీ సభ్యులుగా కర్ర వెంకటేశ్వరావు, బెజవాడ నాగేశ్వరావు, ఎం.సురేష్‌బాబు, పులివర్తి నాగమల్లి, సీహెచ్ రాజశేఖర్‌ను ఎన్నుకున్నట్లు వివరించారు.

అదృశ్యమైన సుమంత్ మృతదేహం లభ్యం



అవనిగడ్డ: మూడు రోజుల క్రితం అదృశ్యమైన చల్లపల్లికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి బొడ్డు సుమంత్(28) మండల పరిధిలోని తుంగలవారిపాలెం వద్ద శవమై కనిపించాడు. బుధవారం స్నేహితుడిని కలుసుకునేందుకు వెళ్లిన సుమంత్ రాత్రయినా రాకపోయే సరికి గాలింపు చర్యలు చేపట్టారు. పులిగడ్డ వారధి వద్ద సుమంత్ బైక్, ఫోన్, చెప్పులు కనిపించగా నదిలోకి దూకి ఆత్మహత్య చేసుకుని ఉంటారని భావించారు. చల్లపల్లి ఎస్‌ఐ సుబ్రహ్మణ్యం నేతృత్వంలో పోలీసు సిబ్బంది రెండు రోజుల నుంచి నదిలో గాలింపు చర్యలు చేపట్టారు. శుక్రవారం తుంగలవారిపాలెం వద్ద నదిలో సుమంత్ మృతదేహం కనబడింది. మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు స్థానిక ఏరియా ప్రభుత్వ వైద్యశాలలో పోస్టుమార్టం చేసి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ చెప్పారు.

వాడీవేడిగా...

- మచిలీపట్నం సాధారణ సమావేశం
- కమిషనర్, అధికారుల తీరుపై మండిపడ్డ వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు
- ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఇంజినీరింగ్ అధికారులు మేయర్‌ను కలవకపోవడాన్ని తప్పుపట్టిన సభ్యులు
- క్లారిఫయర్‌ను ట్రాక్టర్‌తో క్లీన్ చేయడం ఎంతవరకు సరి



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు మేకల సుబ్బన్న, జోగి చిరంజీవి (ఇన్‌సెట్) సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ



వైఎస్సార్ సీపీ సభ్యులతో వాగ్వాదానికి దిగిన టీడీపీ సభ్యులు

మచిలీపట్నంటౌన్: నగరపాలక సంస్థ సాధారణ సమావేశం శుక్రవారం వాడీవేడిగా జరిగింది. నగర మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ అధ్యక్షత వహించిన సమావేశంలో పలు అంశాలపై వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు కమిషనర్‌తో పాటు పలు విభాగాల అధికారుల తీరును తప్పుపట్టారు. మేయర్, పాలక వర్గం దృష్టికి తీసుకురాకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఇకపై ఇలా నడుచుకుంటే ఊరుకోబోమని హెచ్చరించారు. డిప్యూటీ మేయర్ శీలం భారతి, మాజీ డిప్యూటీ మేయర్ లంకా సూరిబాబు, కార్పొరేటర్ మేకల సుబ్బన్న, జోగి చిరంజీవి, పల్లి శేఖర్, షేక్ షాహెనా లతో పాటు పలువురు కార్పొరేటర్లు అధికారుల తీరును తప్పుపట్టారు. టీడీపీ సభ్యులు పలుమార్లు వీరికి అడ్డుతగులుతూ అధికారులతీరుకు వత్తాసు పలికారు. సమావేశంలో ఐదు అంశాలతో కూడిన అజెండాలో పొందుపరిచారు. పన్నులు చెల్లించే వారికి లాటరీ పద్ధతిలో రూ. 2 లక్షలతో బహుమతులు ఇచ్చే అంశాన్ని సమావేశం తిరస్కరించింది. ఈ మొత్తంతో కార్యాలయంలో మరుగుదొడ్లు, తాగునీరు వసతి ఏర్పాటు చేస్తే ప్రజలకు ఉపయోగంగా ఉంటుందని సుబ్బన్న సూచించారు.

బాధ్యతలు స్వీకరించిన ఉద్యోగులు మేయర్‌ను కలవరా!

ఇటీవల బదిలీపై వచ్చిన ఇంజినీరింగ్ అధికారులు నగర ప్రథమ పౌరురాలైన మేయర్‌ను కలవకపోవడాన్ని సభ్యులు తప్పుపట్టారు. మేయర్‌తో పాటు వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లను కలవకుండా ఆయా డివిజన్లలో ఇన్‌చార్జ్‌లుగా చెప్పుకునే వారిని కలవటం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. పలు డివిజన్లలో పనులు నిర్వహిస్తున్నా కార్పొరేటర్లకు చెప్పకుండా ఇన్‌చార్జిలకు చెప్పి చేయటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. .

ఖజానా అధికారి, పూర్వ ఉద్యోగి రూ. 4.20 లక్షలు అడ్వాన్స్ తీసుకోవడంపై చర్చ

ఖజానా అధికారి మోహన్‌గోపాల్ కంప్యూటర్లు, టేబుల్ వంటివి కొనుగోలు చేసేందుకంటూ ఏప్రిల్ 22న రూ. 3.20 లక్షలు అడ్వాన్స్‌గా తీసుకోవడాన్ని కార్పొరేటర్ మేకల సుబ్బన్న తప్పుపట్టారు. ఖజానా తన చేతిలో ఉందని ఇష్టానుసారంగా అడ్వాన్స్‌లు తీసుకోవడం నిబంధనలకు విరుద్ధం కాదా అని ప్రశ్నించారు. ఇక్కడ పని చేసిన నరేష్ అనే మరో ఉద్యోగికి కంప్యూటర్ల కొనుగోలు పేరుతో మార్చి 22న లక్ష రూపాయలు అడ్వాన్స్‌గా చెల్లించటాన్ని ఆయన తప్పుపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన ఈ ఇద్దరు ఉద్యోగులను సస్పెండ్ చేయడమో, ప్రభుత్వానికి సరెండర్ చేయాలని ఆయన కోరారు. ఇలా అడ్వాన్స్‌గా తీసుకోవడం ఎలా కుదురుతుందని కమిషనర్ బాపిరాజు సమాధానం చెప్పాలని సుబ్బన్న కోరారు. కమిషనర్ బదులిస్తూ ఉద్యోగులు నగర పాలక సంస్థ పరిధిలోనే పనిచేస్తారని ప్రభుత్వానికి సరెండర్ చేయడం కుదరదని తెలిపారు.

క్లారిఫయర్‌ను ట్రాక్టర్‌తో క్లీన్ చేయడమా!

నగరంలో సరఫరా అవుతున్న నీరు మురిగ్గా వస్తున్నాయని దీనికి వైఎస్సార్ సీపీ పాలకులే కారణమని టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారని ఇది విచారకరమని సుబ్బన్న పేర్కొన్నారు. క్లారిఫయర్‌ను శుభ్రం చేసేందుకు క్రేన్‌తో ట్రాక్టర్‌ను దింపి ఎలా శుభ్రం చేయిస్తారని ఇది నిబంధనలకు విరుద్ధం కాదా దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి మీపై చర్యలు తీసుకుంటామని ఎంఈ, కమిషనర్‌ను సుబ్బన్న హెచ్చరించారు. దీనికి కమిషనర్ బాపిరాజు బదులిస్తూ ట్రాక్టర్‌తో క్లీన్ చేయించటం తప్పే అయినా శుభ్రపరిచే పని వేగంగా జరగాలనే ఉద్దేశంతో ఇలా చేశారని తెలిపారు. ఆర్పీలను ఇష్టానుసారంగా తొలగించేందుకు ప్రయత్నిస్తున్నారని ఇలా అయితే చర్యలు తప్పవని సీఎంఎం ఆనంద్‌ను కార్పొరేటర్లు ప్రశ్నించారు. మహిళలతో నీవు వ్యవహరిస్తున్న తీరు, డ్వాక్రా మహిళలతో ఓ పార్టీకి సభ్యత్వం చేర్పించే ప్రయత్నం, పార్టీ చొక్కాలు వేసుకోవాలని సూచిస్తున్నావంటూ తీరు మార్చుకోవాలని ఆనంద్ ను హెచ్చరించారు. 43వ డివిజన్‌లో అడ్మిన్‌ను నియమించాలని కోరుతున్నా నియమించకపోవటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వెంటనే నియమించాలని మేయర్ వెంకటేశ్వరమ్మ కమిషనర్‌ను కోరారు. తన డివిజన్‌లో మేస్త్రీ లేకుండా పారిశుద్ధ్య పనులు ఎలా చేస్తారని 28వ డివిజన్ కార్పొరేటర్ షాహెనా కమిషనర్‌ను కోరారు. సమావేశంలో డిప్యూటీ మేయర్ మాడపాటి విజయలక్ష్మి, మాజీ మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, మాజీ డిప్యూటీ మేయర్లు బందెల కవిత, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

వసతి గృహంలో సమస్యలుంటే తెలపండి

సీనియర్ సివిల్ జడ్జి కేవీ రామకృష్ణయ్య



బీసీ వసతి గృహంలో విద్యార్థులతో మాట్లాడుతున్న జడ్జి రామకృష్ణయ్య

పెడన: వసతి గృహంలో ఏమైనా ఇబ్బందులున్నా, సమస్యలున్నా తెలియజేయాలని, అందుకు టోల్ ఫ్రీ నంబర్లను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయసేవాధికారి సంస్థ జిల్లా కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కేవీ రామకృష్ణయ్య అన్నారు. శుక్రవారం సాయంత్రం బ్రహ్మపురంలోని బీసీ వసతి గృహాన్ని సందర్శించి విద్యార్థులకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మచిలీపట్నం మొబైల్ కోర్టు జడ్జి వాహిని, ట్రైనీ జడ్జీలు, ఎస్‌ఐ సత్యనారాయణ, న్యాయవాదులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాలల సంరక్షణ కేంద్రాలు నమోదు చేసుకోవాలి

చిలకలపూడి(మచిలీపట్నం): జువెనైల్ జస్టిస్ చట్టం ప్రకారం బాలల సంరక్షణ కేంద్రాలు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని బాలల సంక్షేమం, సంస్కరణలు, సేవలు, వీధి బాలల సంక్షేమశాఖ జిల్లా పర్యవేక్షణాధికారి సత్యవతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 11వ తేదీలోపు నిర్దేశించిన ప్రొఫార్మాలో దరఖాస్తు ఫారాన్ని విజయవాడ కార్యాలయానికి పంపాలన్నారు. వెబ్‌సైట్‌లో పూర్తి వివరాలను పొందుపరిచామని తెలిపారు. మరిన్ని వివరాలకు 91000 45423, 93985 83329 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ముద్దబంతి సాగుపై రైతుల ఆసక్తి



బొబ్బర్లంకలో అరటిలో అంతరపంటగా ముద్దబంతి సాగు

బొబ్బర్లంక(మోపిదేవి): ముద్దబంతి పూల సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. మోపిదేవి, బొబ్బర్లంక, మోపిదేవిలంక తదితర గ్రామల్లో సుమారు ఐదు ఎకరాల్లో ముద్దబంతి పూల సాగు చేస్తున్నారు. కార్తికమాసం, అయ్యప్ప స్వామి భజనలు, సంక్రాంతి పండుగలను దృష్టిలో పెట్టుకుని రైతులు బంతిపూల సాగు చేస్తున్నారు. ఈ సాగు కేవలం నాలుగు నెలలు మాత్రమే కావడంతో కొన్నిచోట్ల అంతర పంటగా కూడా వేశారు. బొబ్బర్లంకలో కోనేరు శివలీల ఎకరం భూమిలో అరటితోటలో అంతర పంటగా బంతి సాగు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అరటి పంట సంవత్సరానికి చేతికి వస్తుందని, ఈ లోపు నాలుగు నెలల కాలపరిమితి ఉన్న ముద్దబంతి పూలసాగు చేసినట్లు చెప్పారు. మొక్క రూ. 5 చొప్పున ఎకరాకు సుమారు 8,500 మొక్కలు నాటినట్లు మొత్తంగా రూ. 45 వేలు ఖర్చులు అయినట్లు తెలిపారు. నాటిన 40 రోజులకే కటింగ్‌కు వస్తాయని వివరించారు. ప్రభుత్వం హెక్టారుకు రూ. 16 వేలు సబ్సిడీ అందించి ప్రోత్సహించడంతో రైతులు సాగుకు ముందుకు వస్తున్నారని ఉద్యానవన శాఖాధికారులు తెలిపారు. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో రూ. 100 ధర పలుకుతోందని వివరించారు.

దాళ్వాకు సాగునీరివ్వండి

బంటుమిల్లి: దాళ్వాకు సాగునీరు ఇవ్వాలని రైతులు డిమాండ్ చేశారు. దాళ్వాకు సాగునీరివ్వక పంట భూములు చౌడుబారి పోయాయనని, తక్షణం అందించి రైతుల పంట భూములను కాపాడలంటూ రైతు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. బంటుమిల్లిలో అంబేద్కర్ సెంటర్ నుంచి మెయిన్‌రోడ్డు మీదుగా రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సముద్ర తీర ప్రాంతం కావడంతో దాదాపు 90 శాతం భూముల్లో, మినుములు, అపరాలు పంట పండక, కనీసం పెట్టుబడి, విత్తనాల ఖర్చులు రాక తీవ్రంగా నష్టపోతున్నామని వాపోయారు. బంటుమిల్లి తహసీల్దార్ కె.భరత్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం కృష్ణా జిల్లా కార్యదర్శి గొరిశెట్టి నాగేశ్వరరావు, బంటుమిల్లి మండల రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మలిశెట్టి శివరాం ప్రసాద్, అజయ్‌ఘోష్, పట్టపు ఏసు బాబు, రైతులు పాల్గొన్నారు.

నీటి సంఘాల ఎన్నికలు విజయవంతం చేయాలి

తహసీల్దార్ హరనాథ్



మాట్లాడుతున్న తహసీల్దార్ హరనాథ్, ఎంపీపీ రాఘవరాణి, ఎంపీడీఓ రామ్‌కుమార్

నాగాయలంక: నీటి సంఘాల ఎన్నికలు విజయవంతం చేయాలని తహసీల్దార్ ఎం.హరనాథ్ చెప్పారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ రాఘవరాణి అధ్యక్షతన శుక్రవారం జరిగింది. వారనాథ్ మాట్లాడుతూ మండలంలో ఈ నెల 21న నీటి సంఘాల ఎన్నికలు జరుగబోతున్నాయని చెప్పారు. మండల పరిధిలో మొత్తం 108 టీసీలకు 9 నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఏటిమొగ–ఎదురుమొండి వద్ద కృష్ణానదిలో తిరుగుతున్న పంటును మరమ్మతుల కారణంగా శనివారం నుంచి 15 నుంచి 20 రోజుల పాటు నిలిపివేస్తున్నామని వెల్లడించారు. ప్రజలు రెండు బోట్‌లతో కట్టిన నావల్లోనే ప్రయాణించాలని సూచించారు. ఎంపీడీఓ జె.సీతారామ్‌కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అనుచితంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు

కృత్తివెన్ను: ఆడపిల్లల విషయంలో అనుచితంగా ప్రవర్తించినా, తప్పుగా నడుచుకున్నా కఠినంగా శిక్షిస్తామని కృత్తివెన్ను ఎస్‌ఐ పైడిబాబు అన్నారు. సంగముడి ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు శుక్రవారం చట్టాలపై పలు విషయాలను ఆయన వివరించారు. బాలికలు తెలిసీతెలియని వయసులో ఎలా ఉండాలి, గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌లను వివరించారు. ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తిస్తే తల్లిదండ్రులకు తెలియజేయాలని సూచించారు.

ఘంటసాల: గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై బాలికలు అవగాహన కలిగి ఉండాలని ఘంటసాల ఎస్‌ఐ కె.ప్రతాప్‌రెడ్డి తెలిపారు. కృష్ణా ఎస్పీ ఆదేశాల మేరకు ఘంటసాల జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈఎస్‌ఐ ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ గుర్తు తెలియని వ్యక్తులు, తెలిసిన వ్యక్తులు బాలికతో అసభ్యకరంగా వ్యవహరిస్తే టీచర్లకు, తల్లిదండ్రులకు లేదా పోలీసులకు సమాచారం ఇవ్వాలని చెప్తూ అవగాహన కలిగించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పోతన ఈశ్వరరావు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

అవనిగడ్డ: గుడ్‌టచ్ బ్యాడ్ టచ్‌పై స్థానిక నారాయణ స్కూల్‌లో ఎస్‌ఐ శ్రీనివాస్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికలు పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు.

కనులపండువగా ధ్వజస్తంభ ప్రతిష్ట



గూడూరు: పొట్లేలుగుంటాయిపేట మదన వేణుగోపాలస్వామి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ శుక్రవారం కనులపండువగా సాగింది. పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారి కల్యాణోత్సవాలు ఘనంగా జరిగాయి. నిర్వాహకులు అన్నసమారాధన చేశారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పెడన: పెడన, బ్రహ్మపురం, చేవేంద్ర ఉప విద్యుత్ కేంద్రాల పరిధిలో శనివారం ఉదయం 7 నుంచి 9 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలుపు చేస్తున్నట్లు ఏపీఎస్‌పీడీసీఎల్ మచిలీపట్నం ఈఈ జీబీ శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మరమ్మతుల నిమిత్తం ఆయా ఉప విద్యుత్ కేంద్రాల పరిధిలో కరెంట్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

కృత్తివెన్ను: విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్వహణ జరుగుతుండటంతో శనివారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈఈ శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని కృత్తివెన్ను, లక్ష్మీపురం, చెరుకుమిల్లి సబ్‌స్టేషన్లలో మరమ్మతులు జరుగుతాయని పేర్కొన్నారు.

మచిలీపట్నంటౌన్: చిలకలపూడి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గాంధీనగర్‌లో 11 కేవీ లైన్ల మరమ్మతుల కారణంగా ఈనెల 9 వ తేదీ శనివారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు కరెంట్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ మచిలీపట్నం డివిజన్ ఈఈ శ్రీనివాసరావు శుక్రవారం ఒక తెలిపారు. గాంధీనగర్, నరసింహనగర్, కొబ్బరి తోట, సి.ఎస్.ఆర్.నగర్‌లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

మిల్క్ యూనియన్ పథకాలు వినియోగించుకోండి

బంటుమిల్లి: పాడి పరిశ్రమను ప్రోత్సహించడానికి జిల్లా మిల్క్ యూనియన్ అందిస్తున్న పథకాలను రైతులు వినియోగించుకోవాలని యూనియన్ జిల్లా చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. మండలంలోని ముంజులూరు పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార సంఘాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా డైరెక్టర్ అర్జా నగేష్‌బాబు, మేనేజర్ తోట సత్యనారాయణ, సంఘం అధ్యక్షుడు కూనపరెడ్డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

- పెడన: మండలంలోని జింజేరు పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార సంఘాన్ని చైర్మన్ ఆంజనేయులు సందర్శించి పాల ఉత్పత్తిదారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు నెలలకు పది శాతం చొప్పున ధర వ్యత్యాసం(బోనస్) పంపిణీ చేస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో జిల్లా యూనియన్ పాలక వర్గ సభ్యుడు నగేష్, గుడ్లవల్లేరు పాల శీతలీకరణ కేంద్రం మేనేజర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ ఉచిత శిక్షణ స్క్రీనింగ్ పరీక్ష వాయిదా

చిలకలపూడి(మచిలీపట్నం): సాంఘిక, గిరిజన సంక్షేమశాఖల ఆధ్వర్యంలో డీఎస్సీ ఉచిత శిక్షణకు అభ్యర్థుల ఎంపికకు నిర్వహించనున్న స్క్రీనింగ్ పరీక్ష వాయిదా పడినట్లు సాంఘిక సంక్షేమశాఖ డెప్యూటీ డైరెక్టర్ షేక్ షాహెద్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10వ తేదీ నిర్వహించాల్సిన పరీక్ష ఎమ్మెల్సీ ఎన్నికల నియమావళి అమలులో ఉండటంతో వాయిదా వేశారు. పరీక్ష తర్వాత ఎప్పుడు నిర్వహించేది అభ్యర్థులకు తెలియపరుస్తామని పేర్కొన్నారు.

సమస్యలను పరిష్కరించండి



ఎంపీడీవోకు సమస్యను వివరిస్తున్న ఉద్యోగులు

చిలకలపూడి(మచిలీపట్నం): దీర్ఘకాలికంగా ఉన్న తమ సమస్యలను పరిష్కరించాలని 104 ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎ.మురళీకృష్ణ కోరారు. ఈ మేరకు శుక్రవారం ఎంపీడీవోకు వినతి పత్రం అందజేశారు. మురళీకృష్ణ మాట్లాడుతూ మూడు నెలలుగా వేతనాలు ఇవ్వటం లేదన్నారు. దీంతో కుటుంబం పోషణ చాలా కష్టతరమవుతోందన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా క్షేత్ర స్థాయిలో అనేక వైద్యసేవలను అందిస్తున్నామన్నారు. యాజమాన్యం నుంచి రావాల్సిన ఇతర బకాయిలు చెల్లించేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని ఆయన కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సంఘ నాయకులు సురేష్, సతీష్, రాజ్‌కుమార్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

'104' సిబ్బంది సమస్యలు పరిష్కరించండి

నాగాయలంక: విస్తృత వైద్య సేవలు అందిస్తున్న తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండల 104 ఎంఎంయూ డాటా ఎంట్రీ ఆపరేటర్ డి.గంగాభవాని, వాహన డ్రైవర్ ఎస్.వీరబాబు శుక్రవారం తహసీల్దార్ ఎం.హరనాథ్‌కు వినతి పత్రం అందజేశారు. యాజమాన్యం చెల్లించాల్సిన మూడు నెలల జీతాలు తక్షణం చెల్లించాలని, 104సర్వీసులను గతంలో మాదిరి పీహెచ్‌సీల ద్వారా తక్కువ ఖర్చుతో నిర్వహించాలని, జీవో నంబర్ 7 ప్రకారం ఉద్యోగ భద్రత కల్పించాలని తదితర డిమాండ్లతో వారు వినతిపత్రం సమర్పించారు.

ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్న రెవెన్యూ

ఐదు ట్రాక్టర్లకు ఒక్కోదానికి రూ.3,200 జరిమానా



శ్రీకాకుళం వద్ద అదుపులోకి తీసుకున్న ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్

ఘంటసాల: కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం ఇబ్బందికరంగా మారిందని అధికార వర్గాల నుంచి తెలుస్తోంది. ఘంటసాల మండలం శ్రీకాకుళం నుంచి పాపవినాశనం డొంకకు వెళ్లే ప్రాంతంలోని కృష్ణానదిలో గురువారం అర్ధరాత్రి కొంతమంది కూటమి చోటా నేతల ఆధ్వర్యంలో ఇసుక తవ్వకాలు చేపట్టారు. కొన్ని గంటల వ్యవధిలో పదుల సంఖ్యలో ట్రాక్టర్లు చేరుకుని ఇసుక తవ్వకాలు చేపట్టిన కూలీలు స్థానిక ట్రాక్టర్‌కు రూ.500, బయట నుంచి వచ్చిన ట్రాక్టర్లు ఇసుకను బట్టి రూ.1000 నుంచి రూ.1500 వరకు వసూలు చేస్తున్నట్లు సమాచారం. ఇసుక అక్రమ రవాణ జరుగుతోందని తెలుసుకున్న ఘంటసాల తహసీల్దార్ బి.విజయప్రసాద్ ఆదేశాలతో ఆర్‌ఐ కె.శ్రీనివాస్, శ్రీకాకుళం, పాపవినాశనం వీఆర్వోలు డి.గోపి, శివప్రసాద్ ఇసుక తవ్వకాలను నిలిపి వేసి ఎనిమిది ఇసుక ట్రాక్టర్లను అదుపులోకి తీసుకున్నారు. శుక్రవారం ఐదు ట్రాక్టర్ల ఇసుక లోడును తహసీల్దార్ కార్యాలయం వద్ద డంపింగ్ చేయించి మొదటి తప్పుగా భావించి ఒక్కో ట్రాక్టర్‌కు రూ.3,200 జరిమానా విధించినట్లు తహసీల్దార్ బి.విజయప్రసాద్ తెలిపారు. మిగిలిన మూడు ట్రాక్టర్ల డ్రైవర్లు పరారీలో ఉన్నట్లు తహసీల్దార్ తెలిపారు. మరోసారి అక్రమ ఇసుక రవాణ చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డ్రైవర్లను హెచ్చరించారు.

ప్రభుత్వం అనుమతించిన రీచ్‌లోనే ఇసుక తవ్వకాలు

ప్రభుత్వం నుంచి అనుమతించిన ఇసుక రీచ్‌ల్లోనే ఇసుక తవ్వకాలు చేయాలని తహసీల్దార్ బి.విజయప్రసాద్ అన్నారు. శ్రీకాకుళం ప్రభుత్వం కేటాయించిన ఇసుక రీచ్‌ల్లో నీరు ఉండటంతో ఉచిత ఇసుక తవ్వకానికి అవకాశం లేదన్నారు. అనుమతుల్లేని ప్రాంతం నుంచి ఎడ్లబండ్లు, ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. రెండు మూడు రోజుల్లో ఉచిత ఇసుక అనుమతిచ్చిన ప్రాంతంలో నీరు తగ్గే అవకాశముందని అప్పటి నుంచి అందుబాటులోకి వస్తుందని తహసీల్దార్ విజయప్రసాద్ తెలిపారు.

భగవద్గీత కంఠస్త పోటీలను జయప్రదం చేయండి



మచిలీపట్నంటౌన్: టీటీడీ, హిందూ ధర్మ ప్రచార పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో గీత జయంతి సందర్భంగా డిసెంబరు 5వ తేదీ నిర్వహించే సంపూర్ణ శ్రీ మద్భాగవద్గీత శ్లోక కంఠస్త పోటీలను జయప్రదం చేయాలని రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర కోరారు. కంఠస్థ పోటీలకు సంబంధించిన బ్యానర్‌ను శుక్రవారం బందరులో ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కృష్ణాజిల్లా ప్రోగ్రాం అసిస్టెంట్ సీవీకే ప్రసాద్, ముదిగొండ నాగవీరభద్రశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

మహిళా పీఎస్ డీఎస్పీగా సురేష్‌కుమార్‌రెడ్డి

చిలకలపూడి(మచిలీపట్నం): మచిలీపట్నంలోని మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీగా ఎన్.సురేష్‌కుమార్‌రెడ్డిని నియమిస్తూ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సీహెచ్ ద్వారక తిరుమలరావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన పోస్టింగ్ కోసం వేచి ఉండటంతో ఇక్కడ నియమించారు. ప్రజల ఇబ్బందులు తొలగిస్తామన్నారు.

వివాహిత అదృశ్యం

నాగాయలంక: గ్రామంలోని ఆరో వార్డుకు చెందిన పొన్నూరు శ్యామ్‌కుమార్ తన భార్య నాగకన్య(41)కనించడంలేదని నాగాయలంక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్‌ఐ కలిదిండి రాజేష్ తెలిపిన వివరాల ప్రకారం శ్యామ్ కుమార్ అవనిగడ్డ హోటల్‌లో పని చేస్తుంటాడు. వారికి ఇద్దరు పిల్లల్లో కుమార్తై కరోనా సమయంలో మరణించగా, కుమారుడు అవనిగడ్డలో ఇంటర్ చదువుతున్నాడు. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం అవనిగడ్డ హోటల్ పనికి వెళ్లిన తర్వాత శ్యామ్ తల్లి అతనికి ఫోన్ చేసి నాగకన్య కనిపించడం లేదని సమాచారం ఇచ్చింది. ఇంటికి వచ్చిన శ్యామ్ బంధువులు, తెలిసిన వారికి సమాచారం తెలిపి వెదకడంతో ఆమె కనిపించక పోయేసరికి శుక్రవారం స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

నిత్యావసరాలు అందజేత

పెడన: అనారోగ్యానికి గురై ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న చేనేత కార్మికుల్లో ఐదు కుటుంబాల వారికి నిత్యావసర సరుకులను శుక్రవారం పంపిణీ చేశారు. కొలుకుల జయశంకర్ ఆర్థిక సౌజన్యంతో జోగానందరావు కాలనీకి చెందిన బళ్ల సుబ్రహ్మణ్యం కుటుంబంతోపాటు మరో నాలుగు కుటుంబాలకు రూ.2 వేల చొప్పున నిత్యావసర సరుకులు, బియ్యం అందజేశామని ప్రభుత్వ జూనియర్ కళాశాల లైబ్రరీసైన్స్ అధ్యాపకులు పేరిశెట్టి నాగరవి, పిచ్చుక నిరంజనరావు తెలిపారు.